www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -128 శనివారం 22 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

- చెన్నై కావేరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన దిగ్గజ నటి
- 1950లో 'షావుకారు' చిత్రంతో సినీ అరంగేట్రం
- 2022లో పద్మశ్రీ పురస్కారం

**చెన్నైఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో తనదైన ముద్ర వేసిన దిగ్గజ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో ఇటీవలే ఆమె చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం

మిగతా 2లో.



## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..

- జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై నడ్డా సమీక్ష
- నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలను సమీక్షించిన నడ్డా
- వ్యాధి లక్షణాలున్నవారిని ముందస్తుగా గుర్తించడం కీలకమన్న కేంద్ర మంత్రి

**ఢిల్లీ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో.




## రాహుల్ మెరుపు ధర్నా

- పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ
- ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా
- జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ
- పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన



**ఢిల్లీ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను

మిగతా 2లో.

# తెలంగాణ కాంగ్రెస్ లో రాజకీయ రచ్చ



- కూతురు వ్యాఖ్యలతో సురేఖ రాజీనామాకు ఎమ్మెల్యేల డిమాండ్
- గుర్తింపు కోసమే సుష్మిత తాపత్రయమా?
- నల్లగొండలో మంత్రి పదవి కోసం రాజగోపాల్‌రెడ్డి పట్టు..
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో బాహాబాహీ..
- పీసీసీ పట్టించుకోవడం లేదని కార్యకర్తల ఆవేదన ..

**హైదరాబాద్ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎలా ఎన్నా వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, నాయకులు బహిరంగ విమర్శలు చేసుకుంటున్నారు. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం నడుస్తుండగానే మరోవైపు కొండా సురేఖ్ కూతురు సుష్మిత ముఖ్యమంత్రి

మిగతా 2లో.







## వివేకా హత్య కేసులో ఈడీ తనిఖీలు..

- వివేకా హత్య కేసులో మనీలాండరింగ్ కోణంలో విచారణ
- హైదరాబాద్, పులివెందులలోని నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు
- ఇతర నిందితుల ఇళ్లలోనూ కొనసాగుతున్న తనిఖీలు

**హైదరాబాద్ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. వివేకా హత్య కేసు విచారణలో భాగంగా అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది.

మిగతా 2లో.

## సాదిక్ ఖాన్ దొరికాడు!

- ఏఈ కుటుంబాన్ని ఆత్మహత్యకు ప్రేరేపించిన షూటింగ్ కోచ్
- భర్తను విషమిచ్చి చంపాడని భార్య సూసైడ్ నోట్
- ప్రైవేట్ ఫొటోలతో బ్లాక్‌మెయిల్, ఆస్తుల కోసం వేధింపులు

**కాకినాడ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాదిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు.

మిగతా 2లో.



## నేడు కేరళకు పవన్ కళ్యాణ్

### ఆయుర్వేద థెరఫీ చేయించుకోన్న డిప్యూటీ సిఎం

**అమరావతిఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. శనివారం కేరళకు వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన.. వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ప్రత్యేక

మిగతా 2లో.



## తెలంగాణ ఆరోగ్య మోడల్ భేష్..

- తెలంగాణ వైద్య సేవలను కొనియాడిన పార్లమెంటరీ కమిటీ
- ఆరోగ్యశ్రీ, టీ-డయాగ్నోస్టిక్స్ పనితీరుపై ప్రశంసలు
- రాష్ట్రంలో క్యాన్సర్ వైద్య సేవలపై ప్రత్యేక సంతృప్తి
- టిమ్స్, బీబీనగర్ ఎయిమ్స్ పనుల పురోగతిపై ఆరా
- ప్రభుత్వ సీఎస్, వైద్యాధికారులతో కమిటీ సభ్యుల భేటీ



**హైదరాబాద్ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్య రంగంలో అమలు చేస్తున్న విధానాలు, పేదలకు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కొనియాడింది. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, టి-డయాగ్నోస్టిక్స్, పాలియేటివ్ కేర్ వంటి పథకాల పనితీరుపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేస్తున్న తీరును ప్రశంసించారు. వివిధ రాష్ట్రాల్లో ప్రజారోగ్య వ్యవస్థలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్న ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ గురువారం హైదరాబాద్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, జాతీయ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశమైంది.

మిగతా 2లో.




## డిగ్రీ ఉంది కానీ ఉద్యోగానికి పనికిరారు

2లో.

- : నీతి ఆయోగ్ సంచలన నివేదిక
- పట్టభద్రులు పెరుగుతున్నా ఉద్యోగాలకు సరిపోవడం లేదు
- అర్హతకు తగ్గ ఉద్యోగం పొందుతున్నది కేవలం 8.25 శాతం మందే
- కళాశాల విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య తీవ్ర అంతరం
- 6వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నీతి ఆయోగ్ సూచన
- డిగ్రీల కంటే నైపుణ్యాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సిఫారసు

# నో పర్మిషన్

## రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎంఈఏ అనుమతి నిరాకరణ

- పర్యటన కార్యక్రమం హోదాకు, ఉద్దేశానికి తగినట్లు లేదని కేంద్రం స్పష్టీకరణ
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి
- అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని సీఎంవో ప్రకటన
- ప్రస్తుతం లండన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు

మిగతా 2లో.



# దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..

**మొదటి పేజీ తరువాయి**

ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు.
ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

# దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి**

తుదిశ్వాస విడిచినట్లు నటీనటుల సంఘం అధ్యక్షుడు నాజర్ ప్రకటించారు.
రాజమహేంద్రవరానికి చెందిన శంకరమంచి జానకి, సినీ రంగంలో 'షావుకారు జానకి'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1950లో ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన తెలుగు చిత్రం 'షావుకారు'తో ఆమె వెండితెర అరంగేట్రం చేశారు. ఆ సినిమా విజయం తర్వాతే ఆమె పేరుకు ముందు 'షావుకారు' చేరింది.తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఆమె సుదీర్ఘ సినీ ప్రయాణం సాగింది. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరతో పాటు బుల్లితెరపైనా నటించారు. ఇటీవల కూడా తెలుగు సినిమాల్లో కనిపించారు. ఆమె చివరిసారిగా 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' చిత్రంలో నటించారు.మొత్తంగా షావుకారు జానకి 450కు పైగా సినిమాల్లో నటించారు. నాలుగు తరాల నటీనటులతో కలిసి పనిచేసిన ఘనత ఆమె సొంతం. ఏంజీఆర్, జయలలిత, ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శివాజీ గణేశన్, రాజ్‌కుమార్ వంటి దగ్గజాలతో స్క్రీన్ చేసుకున్న నటిగా ఆమె రికార్డు సృష్టించారు. సినీ రంగానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2022లో ఆమెకు పద్మశ్రీ పురస్కారం అందించింది. దశాబ్దాల పాటు సాగిన ఆమె నటనా ప్రస్థానం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది.

# నో పర్మిషన్

**మొదటి పేజీ తరువాయి**

ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా కార్యక్రమం ఉండాలని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణానికి అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందే హైదరాబాద్ చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. ఈ పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

# నేడు కేరళకు పవన్ కళ్యాణ్

**మొదటి పేజీ తరువాయి**

ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు పవన్ కల్యాణ్‌కు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలకు, అధికారిక విధులకు దూరంగా ఉండాలని కూడా వైద్యులు సూచించినట్లు జనసేన కేంద్ర కార్యాలయం తెలిపింది. అయితే పాలనా బాధ్యతల నేపథ్యంలో ఆయన వారం రోజుల్లోనే క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు.ఆ తర్వాత ముందుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో శస్త్రచికిత్స చేసిన కుడి భుజం ప్రాంతంలో వాపు పెరగడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేలా చికిత్స తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే కేరళలోని ఆయుర్వేద వైద్యాలయంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స, విశ్రాంతికి ప్రాధాన్యత ఇస్తూనే తన పాలనా బాధ్యతలను కొనసాగించేందుకు పవన్ కల్యాణ్ ప్రయత్నిస్తున్నట్లు జనసేన కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# రాహుల్ మెరుపు ధర్నా

**మొదటి పేజీ తరువాయి**



వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది.అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# తెలంగాణ ఆరోగ్య మోడల్ భేష్..

**మొదటి పేజీ తరువాయి**

క్యాన్సర్ కేర్‌పై ప్రత్యేక సంతృప్తి ఈ సమావేశంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న క్యాన్సర్ కేర్ మోడల్‌పై ప్రధానంగా చర్చ జరిగింది. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల నుంచి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న అత్యాధునిక రేడియేషన్, సర్జికల్, కీమోథెరపీ సేవల వరకు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు జిల్లా, మండల స్థాయిల్లోనే సేవలందించే పాలియేటివ్ కేర్ కేంద్రాల నిర్వహణపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య ఖర్చులతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకుండా ఆరోగ్యశ్రీ పథకం ఆర్థిక కవచంలా నిలుస్తోందని సభ్యులు అభిప్రాయపడ్డారు.
ఈ భేటీలో హైదరాబాద్‌లోని ప్రముఖ జాతీయ పరిశోధనా సంస్థలైన ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్ఐఎన్ ప్రతినిధులు తమ సరికొత్త ఆవిష్కరణలను కమిటీకి వివరించారు. తక్కువ ఖర్చుతో క్యాన్సర్ నివారణ మాలిక్యూల్స్ అభివృద్ధి, క్యాన్సర్ కణాల జన్యుపరమైన మార్పులపై పరిశోధనలు, పోషకాహార లోపాల నివారణ వంటి అంశాలపై తమ ప్రయోగాలను వివరించారు.

**టిమ్స్, ఎయిమ్స్‌పై ఆరా:**
హైదరాబాద్ నలువైపులా సూపర్ స్పెషాలిటీ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రుల నిర్మాణాల పురోగతిపై కమిటీ ప్రత్యేకంగా ఆరా తీసింది. బీబీనగర్ ఎయిమ్స్ పనుల వివరాలను కూడా అడిగి తెలుసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల సీఎస్ఆర్ నిధులను ప్రజారోగ్య వ్యవస్థల బలోపేతానికి మరింత సమర్థంగా వినియోగించుకోవాలని కమిటీ సూచించింది.పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రాంగోపాల్ యాదవ్ నేతృత్వంలోని ఈ బృందంలో 21 మంది ఎంపీలు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి కమిటీలో సభ్యులుగా ఉన్న ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, డాక్టర్ బి.పార్థసారథిరెడ్డి ఈ సమావేశంలో పాల్గొని, రాష్ట్రంలోని క్షేత్రస్థాయి అంశాలను ఇతర సభ్యులకు వివరించారు.

# డిగ్రీ ఉంది కానీ ఉద్యోగానికి పనికిరారు

## : నీతి ఆయోగ్ సంచలన నివేదిక




**ఢిల్లీ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
భారతదేశంలో ఉన్నత విద్య పూర్తిచేస్తున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతున్నా, వారి అర్హతకు తగిన ఉద్యోగాలు పొందడంలో తీవ్రంగా విఫలమవుతున్నారని నీతి ఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని కళాశాల విద్యకు, ఉద్యోగ మార్కెట్ అవసరాలకు మధ్య తీవ్ర అంతరం ఉందని తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. "వికసిత్ భారత్ ఏ2047 కోసం నైపుణ్యాలపై పునరాలోచన" పేరుతో ఆగస్టు మధ్యలో విడుదల చేసిన ఈ పత్రంలో పలు కీలక విషయాలను వెల్లడించింది.
నివేదిక ప్రకారం, దేశంలో డిగ్రీ పూర్తి చేస్తున్న వారిలో కేవలం 8.25 శాతం మంది మాత్రమే తమ చదువుకు సంబంధించిన ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. కళాశాలల్లో బోధించే సిలబస్‌కు, పరిశ్రమల వాస్తవ అవసరాలకు మధ్య ఏమాత్రం పొంతన ఉండటం లేదని నీతి ఆయోగ్ తేల్చి చెప్పింది. చాలా విద్యాసంస్థల్లో పాఠ్యప్రణాళికలు కాలం చెల్లినవిగా ఉన్నాయని, అవి పరిశ్రమల డిమాండ్లకు అనుగుణంగా లేవని పేర్కొంది. బీఏ, బీకాం, బీఎస్సీ వంటి సాధారణ డిగ్రీలు నేరుగా ఉద్యోగాలను అందించడంలో విఫలమవుతున్నాయని, కనీస స్థాయి ఉద్యోగాలకు కూడా అదనపు ప్రాక్టికల్ నైపుణ్యాలు అవసరమవుతున్నాయని వివరించింది.
ఈ సమస్యపై విద్యార్థుల్లోనూ స్పష్టమైన అవగాహన ఉన్నట్లు నివేదిక తెలిపింది. తమ చదువులో నైపుణ్యాల కొరత ఒక ప్రధాన సమస్య అని 34 శాతం మంది విద్యార్థులు అభిప్రాయపడగా, ఇంటర్వ్యూలకు సరిగా సిద్ధం కాలేకపోతున్నామని మరో 18 శాతం మంది పేర్కొన్నారు. పరిమితంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగాల కోసం నెలకొన్న తీవ్రమైన పోటీనే ఈ సంక్షోభానికి నిదర్శనమని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. ఇటీవలి కాలంలో కేవలం 55,000 ప్రభుత్వ పోస్టుల కోసం ఏకంగా 1.86 కోట్ల దరఖాస్తులు రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని తెలిపింది.
ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు నీతి ఆయోగ్ కొన్ని కీలక పరిష్కారాలను సూచించింది.
6వ తరగతి నుంచే విద్యార్థులకు ఉపాధి, వ్యవస్థాపక నైపుణ్యాలపై శిక్షణ ప్రారంభించాలి.
అప్రెంటిస్‌షిప్‌లను ఉద్యోగాలు పొందేందుకు ఒక ప్రధాన మార్గంగా మార్చాలి ("అప్రెంటిస్‌షిప్ ఫర్ ఆల్").
నియామకాల్లో డిగ్రీలకే అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా, అభ్యర్థుల వాస్తవ నైపుణ్యాలను అంచనా వేసే విధానం ("స్కిల్స్-ఫస్ట్ హైరింగ్") తీసుకురావాలి.
డిగ్రీ కోర్సుల్లో పరిశ్రమలకు సంబంధించిన ప్రాక్టికల్ శిక్షణను తప్పనిసరి చేయాలి.
కేవలం పట్టభద్రుల సంఖ్యను పెంచడం వల్ల ప్రయోజనం లేదని, నైపుణ్యాల అంతరాన్ని పూడ్చకపోతే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న లక్ష్యానికి ఆటంకం కలుగుతుందని నీతి ఆయోగ్ హెచ్చరించింది. దేశానికి ఉన్న జనాభా ప్రయోజనం, అవకాశంగా మారాల్సింది పోయి భారంగా మారే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది.

# వివేకా హత్య కేసులో ఈడీ తనిఖీలు..

**మొదటి పేజీ తరువాయి**

తెల్లవారుజాము నుంచే హైదరాబాద్, పులివెందులలోని అవినాశ్ రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 10 ప్రాంతాల్లో వేర్వేరు బృందాలు ఏకకాలంలో ఈ సోదాలు నిర్వహిస్తున్నాయి. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, కీలక పత్రాలు, ఆస్తుల వివరాల కోసం అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.
ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతర నిందితుల నివాసాల్లోనూ ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. పులివెందులలోని దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లతో పాటు, తొండూరు మండలం టి.తుమ్మలపల్లిలోని ఎర్ర గంగిరెడ్డి నివాసంలోనూ తనిఖీలు జరుగుతున్నాయి. ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (ప్రమీలా) కింద ఈ తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, కడప జిల్లా పులివెందులలో కలిపి మొత్తం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లోని కోకాపేటలో ఉన్న అవినాశ్ రెడ్డి విల్లా, పులివెందులలోని ఆయన నివాసంతో పాటు, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డికి చెందిన పులివెందుల భాకరాపురంలోని ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. మొదట భాస్కర్ రెడ్డి ఇల్లు తాళం వేసి ఉండటంతో, బంధువులను పిలిపించి దానిని తెరిపించారు.
వీరితో పాటు సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్లు ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, యెర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, షేక్ దస్తగిరి నివాసాల్లో కూడా ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల సందర్భంగా పలు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**కేసు నేపథ్యం**
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ కు బాబాయి అయిన వైఎస్ వివేకానంద రెడ్డి, 2019 మార్చి 15న పులివెందులలోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. ఈ కేసును మొదట రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయగా, 2020 మార్చిలో ఏపీ హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి బదిలీ అయింది.
ఈ హత్య వెనుక రూ. 40 కోట్ల సుపారీ కుట్ర ఉన్నట్లు అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్ల ఆధారంగా, ఈడీ మనీ లాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. హత్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపుపైనే ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. తాజా సోదాలు ఈ దర్యాప్తులో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# సాదిక్ ఖాన్ దొరికాడు!

**మొదటి పేజీ తరువాయి**

కొన్ని రోజులుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న అతడిని ఎట్టకేలకు పట్టుకున్నారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సాదిక్ ఖాన్‌ను కాకినాడకు తరలిస్తున్నట్టు సమాచారం.

**అసలేం జరిగిందంటే..**
పంచాయతీ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న టిల్లాపూడి నూకరాజు, ఆయన భార్య, కుమార్తెతో కలిసి ఈ నెల 16న రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు వారు రాసిన సూసైడ్ నోట్‌లో తమ చావుకు కోచ్ సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని స్పష్టంగా పేర్కొన్నారు. తన కుమార్తె సౌజన్యను లోబరుచుకునేందుకు ప్రయత్నించాడని, ముస్లిం మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని, తమ కుటుంబంపై తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశాడని నూకరాజు ఆ లేఖలో ఆరోపించారు. ఈ ఘటన తర్వాత పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆయన భార్య మీనా మృతదేహం కోసం గాలింపు ఇంకా కొనసాగుతోంది. మనవడు ఎలాగోలా ఈదుకుంటూ బయటపడ్డాడు.

**ఐదు బృందాలతో గాలింపు..**
నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి సాదిక్ ఖాన్ పరారీలో ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు కాకినాడ జిల్లా పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, ముంబై నగరాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. పోలీసులను తప్పించుకునేందుకు సాదిక్ ఖాన్ తన సెల్ ఫోన్‌ను ఉపయోగించకుండా, వేర్వేరు ప్రాంతాలకు మారుతూ జాగ్రత్తలు తీసుకున్నాడు. అయినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో అతడి కదలికలను గుర్తించిన పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు.

**వివరాల్లోకి వెళితే..**
ఏఈ నూకరాజు మనవడు, కాకినాడలో సాదిక్ ఖాన్ నడుపుతున్న షూటింగ్ అకాడమీలో చేరాడు. దీన్ని అదనుగా చేసుకున్న సాదిక్, నూకరాజు కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. ముఖ్యంగా, నూకరాజు కుమార్తె సౌజన్యకు మాటలతో వల వేసి, ఆమెను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. క్రమంగా ఆ ఇంటిపై పట్టు సాధించి, ఇంట్లో ఉన్న బంగారం, నగదు, ఏటీఎం కార్డులను కూడా తన నియంత్రణలోకి తీసుకున్నాడు.
సాదిక్ ఖాన్ పెట్టిన తీవ్ర మానసిక హింసను తట్టుకోలేక నూకరాజు కుటుంబం గోదావరి నదిలో దూకింది. అయితే, సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి జూలై 2న మరణించడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. జగదీశ్వర్ రెడ్డి మృతిపై అతని తండ్రి భాస్కర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సౌజన్య రాసిన లేఖలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన భర్త జగదీశ్వర్ రెడ్డికి సాదిక్ ఖాన్ విషపూరిత పదార్థం ఇచ్చి చంపాడని ఆమె ఆరోపించింది. తన ప్రైవేట్ ఫొటోలను అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని, ఆస్తుల కోసం తనతో పాటు తన తండ్రి నూకరాజును కూడా చంపేస్తానని బెదిరించాడని లేఖలో పేర్కొంది. అంతేకాకుండా, ఇస్లాం మతంలోకి మారాలని తనపై ఒత్తిడి తెచ్చాడని కూడా ఆమె ఆరోపించింది.
భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు సాదిక్ ఖాన్‌పై హత్యాప్రయత్నంతో పాటు మరో ఐదు నేరాల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయం తెలియగానే సాదిక్ తన మొబైల్ ఫోన్‌ను వదిలేసి పరారయ్యాడు. ఇతరుల ఫోన్ల నుంచి కాల్స్ చేస్తూ రైలులో పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన మూడు, తూర్పుగోదావరికి చెందిన రెండు పోలీసు బృందాలు అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుడు జగదీశ్వర్ రెడ్డి ఫోన్ కూడా సాదిక్ వద్దే ఉన్నట్లు సమాచారం.
అకాడమీకి వచ్చే యువతులు, బాలికలనే లక్ష్యంగా చేసుకుని "ప్రత్యేక శిక్షణ" పేరుతో సాదిక్ వారిని ఒంటరిగా కలుస్తాడని, శిక్షణ సమయంలో అనుచితంగా ప్రవర్తిస్తాడని కూడా ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# తెలంగాణ కాంగ్రెస్ లో రాజకీయ రచ్చ

**మొదటి పేజీ తరువాయి**

రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో ఆజ్యం పోశాయి. మంత్రి పదవి కోసం రాజగోపాల్‌రెడ్డి రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ ఒత్తిడి పెంచుతున్నారు. సుష్మిత కాంగ్రెస్‌పార్టీలో సీనియర్ నేత కాకపోయినా వరంగల్ జిల్లా రాజకీయాల్లో గుర్తింపు కోసమే ముఖ్యమంత్రిని టార్గెట్ చేసినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో చాలాచోట్ల గ్రూపు రాజకీయాలు, ఆధిపత్య పోరు, ఎమ్మెల్యేలు, మంత్రులు, డిసిసి అధ్యక్షులు, సీనియర్ నేతలు, కొత్త, పాత నేతల మధ్య సమన్వయలోపం ఆ పార్టీ అధిష్టానాన్ని ఇరకాటంలో పడేస్తోంది. మంత్రి పదవుల విషయంలో ఎమ్మెల్యేలు, కొంతమంది నేతలు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు తమకే కేటాయించాలని ఒత్తిడులు చేయడం, తమకు గుర్తింపు ఇవ్వడం లేదని మరికొందరు ఇలా అసంతృప్తులు రాజేస్తున్నారు. అయితే తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువని, ఇలాంటివి వచ్చి పోతుంటాయని, త్వరలోనే అన్ని సర్దుకుంటాయని ఆపార్టీ నేతలు అంటున్నారు. అందుకే కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం లైట్‌గా తీసుకుందా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇవి టీ కప్పులో తుఫాన్ లాంటివి పలువురు నేతలు అంటున్నారు. లైట్‌గా తీసుకుంటే దీని ప్రభావం భవిష్యత్తులో కాంగ్రెస్‌పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడడానికి అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**వరంగల్‌లో మంట లేపిన సుష్మిత వ్యాఖ్యలు ..**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల ఎమ్మెల్యే టికెట్ వ్యవహారంతో మొదలైన వివాదం, మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన సంచలన వ్యాఖ్యలతో తీవ్ర దుమారం రేపింది. తన టార్గెట్ కాంగ్రెస్ పార్టీ కాదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి మాత్రమేనని కొండా సుష్మిత చెప్పి మరింత వేడెక్కించారు. ఈ విషయాన్ని టీపీసీసీతో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. సుష్మిత వ్యాఖ్యలు తనకు సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చినప్పటికీ, ఎమ్మెల్యేలు వాటిని తిరస్కరిస్తున్నారు. సంబంధం లేనప్పుడు ఎందుకు ఖండించలేదని ప్రశ్నిస్తూ, 20 నుంచి 30 మంది ఎమ్మెల్యేలు సీఎల్పీ వేదికగా అత్యవసరంగా సమావేశం అయ్యారు. కొండా సురేఖ కుటుంబం మొత్తాన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వరంగల్ జిల్లా నేతలు డిమాండ్ చేస్తూ టీపీసీసీకి తీర్మానం పంపినట్లు సమాచారం. చర్య తీసుకునేవరకు కాంగ్రెస్ అధిష్టానం వెళ్లే అవకాశం ఉండదని అంటున్నారు. సుష్మిత వ్యాఖ్యలు పార్టీలో టీ కప్పులో తుఫాన్ లాంటివని కొంతమంది కొట్టిపారేస్తున్నారు. అదే సందర్భంలో కొండా సురేఖతో ఉమ్మడి వరంగల్ నేతలకు పొసగడం లేదు.

**నల్లగొండలో రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు దుమారం..**
నల్లగొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒకరంటే ఒకరికి గిట్టని స్థితి. మంత్రి పదవి విషయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సీఎంను బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆయనపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామేల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మధ్య విభేదాలతో మిర్యాలగూడ కాంగ్రెస్ కార్యకర్తలు నలిగిపోతున్నారు.

**ఖమ్మం 'హస్తం లో సెగలు రేపుతున్న వేరు కుంపట్లు**
ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు నానాటికీ ముదిరి పాకాన పడింది. అధికారంలోకి వచ్చామన్న సంతోషం కంటే, స్వపక్షంలోనే ఎవరికి వారే వేరు కుంపట్లు పెట్టుకోవడంతో పాత, కొత్త నాయకుల నడుమ తీవ్రస్థాయి ఖాళీ ఏర్పడింది. జిల్లాను ఏలుతున్న ముగ్గురు కీలక మంత్రుల మధ్య అస్సలు సఖ్యత లేకపోవడం, 'ఎవరికి వారే యమునా తీరే' అన్న చందంగా రాజకీయాలు నడుస్తుండటంతో స్థానిక కాంగ్రెస్ గ్రూపులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 22 ఆగస్టు 2026

# తెలంగాణ విద్యా వ్యవస్థను కాపాడాలి



**నాంపల్లి,(ప్రజావినికిడి):**
తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని,ప్రత్యేక పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత,బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, మధ్యాహ్న భోజనం,ఆట స్థలాలు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, సురక్షితమైన భవనాలు వంటి కనీస సౌకర్యాలు కూడా అనేక చోట్ల లేకపోవడం ఆందోళనకరమని హేమా సుదర్శన్ జిల్లోజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేత, విద్యార్థుల డ్రాపౌట్‌పై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఇటీవల నల్గొండలో 10వ తరగతి విద్యార్థులు ప్రిన్సిపాల్ హత్య కేసులో నిందితులుగా ఉండటం విద్యార్థుల కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ,డ్రగ్స్/గంజాయి నియంత్రణ, పాఠశాల భద్రతపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక సర్వే నిర్వహించనుందని తెలిపారు. మౌలిక వసతులు, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థుల నమోదు, మధ్యాహ్న భోజనం,భద్రత, డ్రగ్స్ నియంత్రణ, పాఠశాల భవనాల పరిస్థితి తదితర అంశాలను పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందిస్తామని పేర్కొన్నారు. సర్వే అనంతరం విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రతినిధులు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి తెలంగాణ విద్యా వ్యవస్థపై సమగ్ర చర్చ చేపడతామని హేమా సుదర్శన్ జిల్లోజు వెల్లడించారు. కార్యక్రమంలో కిసాన్ వింగ్ అధ్యక్షులు నీరేటి ఆంజనేయులు, ఉప్పల్ వార్డ్ ఇంచార్జ్ సి. మల్లికార్జున్ రాష్ట్ర నాయకులు దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# చార్మినార్ బిర్లా అల్ట్రాప్రీమియం రూఫ్స్..




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** దశాబ్దాలుగా, ఫైబర్ సిమెంట్ రూఫింగ్ దాని ప్రధాన లక్షణాలైన బలం, మన్నిక కోసం సాంప్రదాయకంగా విలువ పొందుతోంది. అయితే,నేడు ఈ విభాగం ఒక మార్పును ఎదుర్కొంటోంది. దీర్ఘకాలిక పనితీరును ఎక్కువ కాలం నిలిచే అందంతో కలిపి అందించే రూఫింగ్ పరిష్కారాలను వినియోగదారులు ఎక్కువగా ఆశిస్తున్నారు. భారతదేశంలోని నివాస వాణిజ్య మార్కెట్లలో, ముఖ్యంగా అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోవాతావరణ ప్రభావాలను తట్టుకోవడం, ఉపరితల ఫినిష్‌ను కాపాడుకోవడం నిర్వహణను తగ్గించడం ముఖ్యమైన ప్రత్యేకతలుగా మారాయనీ పేర్కొంది.

# ‘డీక్లాసిఫైడ్’ ఆపరేషన్ సింధూర్’ డిస్కవరీ ప్లస్ లో ప్రసారం..

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి) :**



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, డిస్కవరీ ఛానల్ ‘డీక్లాసిఫైడ్ ఆపరేషన్ సింధూర్’ ద్వారా భారతదేశపు సీనియర్ సైనిక, జాతీయ భద్రతా నాయకత్వం, ఆపరేషనల్ కమాండర్లు, ఫ్రంట్‌లైన్ సిబ్బందితో అపూ ర్వమైన సంభాషణలను అందుబాటులోకి తెచ్చింది. వాస్తవ ప్రపంచంలోని కీలక కథలలోకి ప్రేక్షకులను మరింత లోతుగా తీసుకువెళ్లే ఈ ఛానల్ వారసత్వాన్ని కొనసాగిస్తూ,ఈ డాక్యుసిరీస్ ఆపరేషన్‌కు నాయకత్వం వహించిన వారి ద్వారా, అందులోని కీలక ఘట్టాలు ఎలా రూపుదిద్దుకున్నాయో,ఎలా ఆవిష్కృతమయ్యాయో వెల్లడిస్తుంది. 2026 ఆగస్టు 15న డిస్కవరీలో ప్రీమియర్ అయిన తర్వాత, ఈ రెండు భాగాల డాక్యుసిరీస్ డిస్కవరీ ప్లస్ లో సైతం ప్రసారమవుతుందనీ పేర్కొంది.‘ఆపరేషన్ సింధూర్’ తర్వాత ఇచ్చిన తన మొదటి ఇంటర్వ్యూలో, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ డాక్యుమెంటరీ సిరీస్‌లో ఇలా అన్నారు. శత్రువుల స్థావరాలను, ముఖ్యంగా పహల్గామ్ దాడికి బా ధ్యులైన వారి స్థావరాలను ధ్వంసం చేయడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని మేం నిర్ణయించుకున్నాం అని అన్నారు.ప్రపంచానికి తమ సందేశం చాలా స్పష్టం భారతదేశ ఉదారతను లేదా సహనశీలతను బలహీనతగా భావించకూడదన్నారు. పరిణామాలు ఏవైనప్పటికీ, భారతదేశం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోగలదు, గట్టిగా ఎదురుదాడి చేయ గలదు అని ఆయన అన్నారు.

# ఎస్వీకేలో రౌండ్ టేబుల్ సమావేశం




**ముషిరాబాద్, (ప్రజావినికిడి):** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో (ఎస్వీకే) మాదిగ హక్కుల పరిరక్షణ సమితి మైస ఉపేందర్ మాదిగ ఆధ్వర్యంలో అంబేద్కర్ అభయ హస్తం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో జన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ పాముల రమణ పాల్గొని మాట్లాడారు. ముఖ్య అతిథిగా తాటి కొండ రాజయ్య,ఎస్సీ, ఎస్టీ కమిటి మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్,వివిధ ప్రజా సంఘాల నాయకులు సభ్యులు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# పోమాల్ పల్లి గ్రామంలో ఐమాక్స్ లైట్స్

## ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి -సొంత నిధులతో ఐమాక్స్ లైట్ ఏర్పాటు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కేశంపేట మండలం పోమాల్ పల్లి గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై స్థానిక సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తమ గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,లింగం దాన సర్పంచ్ నాగిల్ల వెంకటేష్,భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,మాజీ సర్పంచులు,తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,గోపాల్ నాయక్ ,క్రిష్ణయ్య ,మాజీ ఎంపిటిసి కోటేశ్వర్, ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి,సహదేవ్, నరేందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్లు సుదర్శన్ గుప్త,నాయకులు బద్రు నాయక్, తుకారాం,సత్యనారాయణ, మురళి,అశోక్, జగన్ రెడ్డి, క్రిష్ణ, యాదగిరి సాయిరాం, సత్యనారాయణ, వేములనర్వ మల్లేష్,శేఖర్, మల్లెష్,శశి, చింటు,పోమాల్ పల్లి వార్డు సభ్యులు అనిత కృష్ణయ్య, జంగయ్య,రాములమ్మ బాలయ్య,రాఘవేందర్,వరలక్ష్మిరోషయ్య,దాసరి యాదమ్మ,నరసింహులు,గ్రామస్తులు బండ క్రిష్ణ యాదవ్,యాదయ్య మీసాల జగన్ శ్రీకాంత్,మల్లేష్,మరియు మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం

# చట్టసభల్లో ప్రజల పక్షాన పోరాటం చేస్తా..

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..**

**సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ**

**(ఎస్ డి వీపీ జేఏసీ )ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కి వినతి పత్రం అందజేత..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా,కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ఏకో టౌన్ పేరుతో డంపింగ్ యార్డు ను ఏర్పాటు చేయడం కోసం 86 ఎకరాల భూమిని జీహెచ్ఎంసీ కి బదలాయిస్తూ జీవో ఆర్టీ నెంబర్ 641ని తీసుకువచ్చిందని,ఈ జీవో రద్దు కోసం చట్టసభల్లో ప్రజల పక్షానా పోరాటం చేయాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ఎస్ డి వీపీ జేఏసీ) నాయకులు స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు నవీన్ కుమార్ రెడ్డి కి వినతి పత్రం అడజేశారు.
ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సిద్దాపూర్ గ్రామం పచ్చని పంట పొలాలతో కళకళలాడుతూ ఉంటుందనీ,ఈ ప్రాంతం కూరగాయల ఉత్పత్తికి ప్రసిద్ధి. జిల్లాలో ఎక్కడా లేని పశు సంపద ఈ ప్రాంతం యొక్క సొత్తు, ఇక్కడి ప్రజానీకం వ్యవసాయం మరియు పాడి సంపద మీదనే ఆధారపడి జీవిస్తున్నారు.ఈ ప్రాంతంలో అమెజాన్, నాట్కో, ఎమ్ఎసెన్, మైక్రోసాఫ్ట్, పోకర్న లాంటి పేరెన్నిక గల భారీ పరిశ్రమలు ఉన్నాయి. ముస్లింలు అలాగే హిందువులు పవిత్రంగా భావించే జహంగీర్ పీర్ దర్గా అలానే అనేక ప్రాచీన దేవాలయాల పవిత్రతకు ఈ డంపింగ్ యార్డు వలన భంగం వాటిల్లుతుందనీ అన్నారు. సిద్దాపూర్ తో పాటు సుమారు 50 గ్రామాల ప్రజల జీవన విధానం పై ప్రభావం చూపే ఈ డంపు యార్డు ను రద్దు చేయాలని,జీవో ఆర్టీ నెంబర్ 641 ను వెనక్కి తీసుకునేలా ప్రభుత్వం పై ప్రజల పక్షాన చట్ట సభల్లో పోరాటం చేయాలని కోరారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్లపుడూ ప్రజలా పక్షాన నిలబడతా అని, సిద్దాపూర్ లో డంపింగ్ యార్డు రద్దు కోసం ప్రస్తుతం జరుగుతున్న పోరాటం సరిపోదని, పోరాటాన్ని ఉదృతం చేయాలని జేఏసీ నాయకులను కోరారు.జేఏసీ ఎలాంటి పోరాట కార్యక్రమాలు నిర్వహించినా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ప్రజలు స్వేచ్ఛందంగా పోరాటంలోకి వచ్చేవిధంగా జేఏసీ కృషి చేయాలని,రాజకీయాలకు అతీతంగా యువతను ఈ ఉద్యమంలోకి వచ్చేవిధంగా అవగాహన కల్పించాలని, రాష్ట్రంలో రాజకీయ భవిషత్ యువతదే అన్నారు.జేఏసీ కోరిన విధంగా చట్ట సభలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం ప్రభుత్వం పై పోరాటం చేస్తానని మాట ఇస్తున్నట్లు తెలిపారు.ఈ



కార్యక్రమంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ఎస్ డి వీపీ జేఏసీ) చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్,కన్వీనర్ పినపాక ప్రభాకర్,కో ఆర్డినేటర్ తిరుమలయ్య, కో చైర్మన్లు బోధనం శ్రీనివాస్ రెడ్డి,వడ్డే బాలయ్య, ఈశ్వర్ నాయక్, భూక్యా రజిత కో కన్వీనర్లు రవీంద్రనాథ్, అర్జునప్ప, శ్రీకాంత్,ఆకాష్ నాయక్, మహేష్, సలహాదారులు అబ్దుల్ రబ్ జామి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్,మహేష్, రవి,శ్రీను,పాండు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ కళాశాల ఏర్పాటుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

**జిఎస్పి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర..**

**వాజేడు,ఆగష్టు 22,(ప్రజావినికిడి):**
శుక్రవారం నాడు వెంకటాపురం మండల కేంద్రమైన ఆర్&బి,గెస్ట్ హౌస్ ఆవరణంలోగోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిఎస్పి,జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ, భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటుకు ఒక ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. 5వ షెడ్యూల్ భూభాగమైన భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసి యువతకు రాజ్యాంగంలో ఆదివాసులకు కల్పించిన హక్కులు చట్టాలపై అవగాహనతో న్యాయవిద్య ఎంతో అవసరమని అన్నారు స్వాతంత్రం వచ్చినేటికీ 80 ఏళ్లు అవుతున్నప్పటికీ కూడా ఆదివాసి చట్టాలు అమలుకు నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి చట్టాలను జీవోలను ఏజెన్సీ ప్రాంతంలో



బూర్జువ గిరిజనేతరుల పార్టీలు అమలు కాకుండా అడ్డు పడుతున్నారని ఆదివాసి చట్టాలు జీవోలు పటిష్టంగా అమలు కావాలంటే భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చెయ్య వలసిందేనని ఆయన అన్నారు.5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలోకి 1/70 చట్టానికి విరుద్ధంగా వలసలు విరిగిపోతున్నాయని వలసలు పెరిగిపోవడంతో ఆదివాసీలు మైనార్టీలో పడిపోయే ప్రమాదం ఉందని అందుకే ఏజెన్సీ ప్రాంతంలో వలస నిరోధిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు కావాలంటే ఏజెన్సీ ప్రాంతలలో పిసా చట్టం ప్రకారం గా పిసా గ్రామ సభలు నిర్వహించి 1/70 కి విరుద్ధంగా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నగిరిజనేతరులను ఏజెన్సీ ప్రాంతాలనుండిమైదాన ప్రాంతానికి తరలించాలనిపిసా గ్రామ సభలలో తీర్మానాలు తక్షణమే చేయాలని ఆయన అన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో శ్రీ కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు. పటిష్టంగా అమలు చేయవలసిన బాధ్యత అధికారులపై ఉందని శ్రీ కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం గా ఏజెన్సీ ప్రాంతంలో భూమిపై నీటిపై అడవిపై సర్వహక్కులు ఆదివాసీలకే చెందుతాయని శ్రీ కోనేరు రంగా రావు కమిటీ సిఫార్సులు చెబుతుంటే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు భూకబ్జాలు ప్రభుత్వ భూములను ఆదివాసీల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుంటే అది ఇంతవరకు సమంజసమని ఆయన అన్నారు. భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని త్వరలో 100 రోజుల దండయాత్ర కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశంలో పదం సుధాకర్, సురేష్, రాజబాబు, సత్యనారాయణ, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# తమ్ముడుని చంపి ఆత్మహత్యగా చిత్రీకరణ

## పోలీసుల విచారణలో తేలిన నిజం




**వాజేడు,ఆగష్టు 22,(ప్రజావినికిడి):** ములుగు జిల్లా వాజేడు మండలం ముత్తారం కాలనీలో చోటుచేసుకున్న అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. తమ్ముడుని చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూసిన అన్న ను పోలీసులు అరెస్టు చేశారు. సొంత తమ్ముడు ని చంపి ఆత్మహత్య చేసుకున్నాడని నమ్మించాలని చేసిన ప్రయత్నం పోలీసుల దర్యాప్తులో అన్న హత్య చేసినట్లు దర్యాప్తులో పోలీసులు శుక్రవారం వెల్లడించారు. వాజేడు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటాపురం సిఐ ముత్యం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మద్యం మత్తులో తరచూ తనను వేధిస్తూ, కొడుతూ బాధించడంతో భరించలేక హతమార్చినట్లు నిందితుడు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు. ఈ నెల18వ తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలో ముత్తారం కాలనీకి చెందిన జాడి రాంబాబు తన ఇంటి వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు వాజేడు ఎస్సై జక్కుల సతీష్ కు సమాచారం అందింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించరు . వైద్యులు అందించిన పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా రాంబాబు మృతి హత్యగా నిర్ధారణ కావడంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా అనుమానితులను విచారించగా మృతుడి అన్న జాడి జానకిరావుపై పోలీసులకు అనుమానం కలిగింది. ముత్తారం కాలనీకి చెందిన జానకిరావు వయస్సు 63 సంవత్సరాలు కాగా,కూలీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మృతుడు రాంబాబుతో కుటుంబపరమైన విషయాలపై తరచూ గొడవలు జరిగేవని,రాంబాబు మద్యం సేవించి వచ్చి తన ఇద్దరు భార్యలను కొట్టడంతో వారు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు. సుమారు 15 రోజుల క్రితం రెండో భార్య రజితను తిరిగి తీసుకురావాలని తన అక్కాచెల్లెళ్లను రాంబాబు కొట్టడంతో వారు భయపడి ఇంటి నుంచి వెళ్లిపోయి మండపాకలోని బంధువుల ఇంటికి వెళ్లినట్లు చెప్పాడు. అలాగే సుమారు పది రోజుల క్రితం రజిత తన పెద్ద కుమార్తె రమ్య కుమారుడి పుట్టు వెంట్రుకల కార్యక్రమం కోసం తన బంధువైన ప్రవీణ్‌ను వెంకటాపురానికి పంపించాలని కోరినట్లు పోలీసులు తెలిపారు. దీంతో జానకిరావు ప్రవీణ్‌ను వెంకటాపురానికి పంపించాడు. అప్పటి నుంచి తన కుమారుడిని ఎందుకు పంపించావంటూ రాంబాబు జానకిరావుతో తరచూ గొడవపడుతూ, మద్యం మత్తులో అతడిని కొట్టేవాడని తెలిపారు. తనను తమ్ముడు పెడుతున్న వేధింపులు భరించలేక చివరకు రాంబాబును హతమార్చాలని జానకిరావు నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ రాత్రి రాంబాబు మద్యం మత్తులో ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో గడ్డి నరికే కొడవలితో అతడి తలపై కొట్టి హతమార్చినట్లు నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

హత్య అనంతరం నిందితుడు తన ఇంటికి వెళ్లి హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని కడిగి ఇంట్లో పెట్టినట్లు తెలిపారు. అనంతరం తన ఇంట్లో ఉన్న రంపాన్ని తీసుకెళ్లి మృతుడి చేతిలో పెట్టి,రాంబాబు తన గొంతును తానే కోసుకుని మృతి చెందినట్లు కనిపించేలా చేసినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం రజిత వద్దకు వెళ్లిన జానకిరావు ప్రవీణ్‌ను పంపించాలని కోరినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు తమను బతకనివ్వడని రజిత చెప్పగా, తానే అతడిని చంపుతానని జానకిరావు చెప్పినట్లు దర్యాప్తులో వెల్లడైంది. రాంబాబు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు ఇంట్లోకి వెళ్లి చూడగా అతడు రంపంతో గొంతు కోసుకుని మృతి చెందినట్లు భావించారు. నిందితుడు కూడా తనకు ఏమీ తెలియనట్లు సంఘటనా స్థలానికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే తానే రాంబాబును హత్య చేసిన విషయాన్ని ఎవరికీ చెప్పకుండా దాచినట్లు విచారణలో నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నేరాంగీకారం అనంతరం పోలీసులు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి జానకిరావును అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నిస్సార్ ఉన్నారు.

# 22-ఏ పై ప్రభుత్వం అన్నదాతలకు స్పష్టత ఇవ్వాలి..

## ఏ ప్రతిపాదికన అన్నదాతల భూములను నిషేధిత జాబితాలో చేర్చారు..

## మాజీ ఎమ్మెల్యే,టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నరసింహులు..






**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 22-ఏ నిబంధనలు,నిషేధిత భూముల జాబితాపై రైతుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం వెంటనే తొలగించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నరసింహులు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22-ఏ పరిధిలోకి ఏ భూములను తీసుకున్నారా స్పష్టతగా వివరించాలని చెప్పారు.

ఏ ప్రాతిపదికన ఆయా భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. ఏ ప్రతిపాదికన భూములను నిషేధిత జాబితాలో చేర్చారు అనే అంశాలపై ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలను వెల్లడించాలని నరసింహులు కోరారు. ముఖ్యంగా తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల భూముల విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల అనవసరమైన భయాందోళనలు నెలకొంటున్నాయని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో మిగులు భూములు, పోరంబోకు,గైరాన్ తదితర భూములను అర్హత కలిగిన పేదలు,రైతులకు వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించిన సందర్భాలు ఉన్నాయని నరసింహులుగుర్తుచేశారు. అటువంటి భూములను ఇప్పుడు ఏ ప్రాతిపదికన 22-ఏ జాబితాలోకి తీసుకున్నారో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లయితే వాటిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. 22-ఏ జాబితాలో ఉన్న భూములపై ప్రభుత్వం ప్రత్యేకంగా పూర్తిస్థాయి సర్వే నిర్వహించాలని నరసింహులు సూచించారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన పాత రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో భూమి పరిస్థితిని నిర్ధారించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రైతుల అపోహలను ప్రభుత్వం తొలగించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. బక్కని22-ఏ జాబితాలో వ్యవసాయ భూములు కూడా ఉన్నందున రైతుల్లో ఆందోళన నెలపొందని తెలిపారు. రైతుల్లో ప్రధానంగా నెలకొన్న అపోహను ప్రభుత్వం తొలగించాల్సిన అవసరం ఉంద ని వివరించారు. భూమి ఏ కేటగిరీలో ఏ కారణంతో జాబితాలో చేరిందో తెలుసుకునే హక్కు రైతులకు ఉందని నరసింహులు పేర్కొన్నారు.

# కొందుర్గు పోచమ్మ బోనాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్





**కొందుర్గు,(ప్రజావినికిడి):** మండల కేంద్రంలో నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలపై పోచమ్మ తల్లికరుణాకటాక్షాలుఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు, భక్తులకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,లక్ష్మణ్ నాయక్,స్థానిక సర్పంచ్ ప్రభాకర్,ఉప సర్పంచ్ చందు, మాజీ సర్పంచులు రాజరామేశ్వర్ రెడ్డి,రాములు, వార్డు సభ్యులు సంజీవ,లింగం, నవీన్,శ్రీకాంత్, వాసూరి, వెంకటేష్,నాయకులు రెడ్డి నర్సింలు,దర్గా రామచంద్రయ్య, రజినీకాంత్,దయ్యాల శేఖర్, ఎల్లప్ప,శ్రీశైలం,శ్రీను,ఆనంతయ్య,ప్రకాష్,నర్సింలు, బుచ్చయ్య తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూళ్లు

## పోలీసుల అదుపులో ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలు

**విశాఖపట్నం,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):** ఐరోపా దేశాల్లో ఆకర్షణీయ కొలువుల పేరిట విశాఖ, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూలు చేసిన ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలిని విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కన్స్‌టలెన్సీని నమ్మి మోసపోయిన బాధితులు ఉత్తరాంధ్ర జిల్లాల్లో వందల మంది ఉన్నారు. ఇందులో 15 మందిపైగా బాధితులు రూ.70 లక్షల మేర కోల్పోయామంటూ విశాఖ నగరంలోని గురుద్వారా పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విశాఖ పోలీసులు సెర్చ్ వారెంట్‌తో గురువారం కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడపలోని నిర్వాహకురాలు సౌజన్య ఇంటికి వెళ్లారు. పోలీసులు రావడం గమనించిన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఎంత ప్రయత్నించినా తెరవలేదు. అతికష్టంపై లోపలికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇంట్లో ఉన్న బంగారం, వెండి, కొన్ని ఆస్తుల పత్రాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాజిల్లా నుంచి ఆమెను విశాఖకు తీసుకు వస్తున్నారు. ఫ్లయింగ్ బోర్డర్స్ పేరుతో సౌజన్య, శ్రీనివాస్ దంపతులు ఓ కన్స్‌టలెన్సీ ఏర్పాటు చేశారు.

విదేశీయుల పేరుతో ఫేక్ ఈ-మెయిల్స్ పంపి, కొన్ని నకిలీ ఇంటర్వ్యూలు చేయించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పెట్టి నిరుద్యోగులకు వల వేశారు. 'తమకు ఉద్యోగాలు వచ్చాయంటూ' సోషల్ మీడియాలో తన గ్యాంగ్‌తోనే కామెంట్లు పెట్టించారు. అది నిజమని నమ్మిన వందలాది మంది నిరుద్యోగులు ఐరోపా దేశాల్లో ఉద్యోగాలు అనగానే రూ.లక్షల్లో తెచ్చి చెల్లించారు. 750 మందిపైగా నిరుద్యోగుల నుంచి రూ.11.46 కోట్లు వసూలు చేసినట్లు కృష్ణాజిల్లా పరిధిలో పలుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో సౌజన్య, శ్రీనివాసరావు దంపతులను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా విశాఖలో తెరపైకి వచ్చిన బాధితుల ఫిర్యాదుతో బెయిల్‌పై ఉన్న ఆమెను మరోసారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఈ బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

# కొండారెడ్డిపల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రవీందర్ యాదవ్





**కేశంపేట,(ప్రజావినికిడి):** మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు,గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరికీ సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలుకలగాలనికోరుకున్నారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని రవీందర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగరావు,మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్,సర్పంచులు గీత వీరేశం, మంజుల జంగయ్య,రమేష్ యాదవ్, ధనలక్ష్మి రామకృష్ణ,మాజీ వైస్ ఎంపీపీ పర్వత్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు,ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హయత్‌నగర్ కోర్టు అభివృద్ధికి మౌలిక వసతులు కల్పించాలని

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో బార్ అసోసియేషన్ వినతి...



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** హయత్‌నగర్ కోర్టు పరిధిలోని న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, కోర్టు ప్రాంగణంలో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరుతూ హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని కోరడం జరిగింది. ఈ సందర్బంగా సుధీర్ రెడ్డి హయత్ నగర్ కోర్ట్ ప్రాంగణానికి విచ్చేసి లాయర్లతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, హయత్‌నగర్ కోర్టులో సుమారు 200 మంది న్యాయవాదులు కోర్టుకు వచ్చే కక్షిదారులు,ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కోర్టు ప్రాంగణంలో పార్కింగ్,రహదారులు,డ్రైనేజీ,తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కోర్టుకు వచ్చే ప్రజలు,న్యాయవాదులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సంబంధిత సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,భాస్కర్ సాగర్,బోడ బిక్షపతి హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె లింగంగౌడ్ తదితర లాయర్లు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలి -కొమ్ము బాబు

## మందకృష్ణ మాదిగకు ఆహ్వాన పత్రిక అందచేత



**ఎల్బీనగర్,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):** ఆగస్ట్ 23 ఆదివారం కొత్తపేటలోని ఓల్డ్ విలేజ్ లో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే బోనాల పండుగ,తొట్టేల ఊరేగింపు కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను ఆహ్వానిస్తూ అంబర్ పెట్ లోని వారి నివాసంలో కలిసి కొత్తపేట ఓల్డ్ విలేజ్ దళిత సంఘం అధ్యక్షులు కొమ్ము బాబు రావు ఆహ్వాన పత్రికను అందజేశారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా వారిని కోరారు. ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించబోయే ఈ బోనాల ఉత్సవాలకు గ్రామ ప్రజలు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కొమ్ము బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ,కొమ్ము సందీప్, మహేష్, శ్రీనివాస్,సాయి ప్రసాద్ ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కారులో మహిళ మృతదేహం లభ్యం

## మృతురాలిని గోదావరిఖనికి చెందిన మానసగా గుర్తింపు

**హన్మకొండ,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కారులో మహిళ మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలో రెండ్రోజులుగా పార్క్ చేసిన కారు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. కారు డిక్కీని ఓపెన్ చేయగా మహిళ మృతదేహం మూటకట్టి ఉంది. కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతురాలు గోదావరిఖనికి చెందిన మానస (33)గా గుర్తించారు. కారును మానస స్నేహితుడు వినోద్ అ÷-దదెకు తెచ్చినట్టు సమాచారం. దీంతో వినోద్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. 'కరీంనగర్‌లో గదిలో ఉన్నప్పుడు మానసకు ఫిట్స్ వచ్చాయి. ఫిట్స్, నోట్లో నుంచి నురగలు వచ్చి ఆమె చనిపోయింది. భయంతో మృతదేహాన్ని ఎల్కతుర్తి వద్ద కారులోనే వదిలి వెళ్లిపోయా' అని వినోద్ పోలీసులకు చెప్పినట్టు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన ఎల్కతుర్తి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వినోద్ చెప్పిన విషయాలు నిర్ధరించుకునే పనిలో ఉన్నారు.

-------

## గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం మహాసభలను విజయవంతం చేయాలి




**ఐనవోలు/ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**ఈ నెల 22న మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్లలోని జీజీ గార్డెన్స్‌లో నిర్వహించనున్న గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్నరాజు యాదవ్ పిలుపునిచ్చారు. మొలకలగూడెంలో సంఘం ఉపాధ్యక్షుడు జక్కుల పరుశురాములు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లబోతుల లింగరాజు రాధికతో పాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ మహిళలకు శుభాకాంక్షలు

**హైదరాబాద్,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**మంగళకరమైన శ్రావణ శుక్రవారం, సకల సౌభాగ్యాలను ప్రసాదించే శ్రీ వరలక్ష్మీ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించే శుభదినం సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రజలందరికీ శ్రీ వరలక్ష్మీ వ్రతి మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ వరలక్ష్మీ దేవి అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

------

## సావుకారు జానకికి రేవంత్ సంతాపం

**హైదరాబాద్,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి గారు దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పాలిటెక్నికకల విలీనంతో నష్టం లేదు: వివేక్

**హైదరాబాద్,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):** నగరంలోని మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మంత్రి వివేక్ ముఖాముఖి నిర్వహించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖ పరిధిలోకి తెచ్చిన నేపథ్యంలో విద్యార్థులు పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒక్కో అంశంపై మంత్రి వారికి స్పష్టత ఇచ్చారు. ఫీజులు, పరీక్షలు, ఈసెట్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వివరించారు. ఇప్పటికే చదువుతున్న విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలగదని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్‌లలో అభివృద్ధి, ఆధునిక సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలతో అనుసంధానం, ఉపాధి కల్పనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు.

-----

## క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్ప


### కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు: కొండా సురేఖ

**హైదరాబాద్,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):** కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. 'నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను'అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## రాచయదుర్గం భూముల వేలానికి తొలగిన అడ్డంకి

### కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకణ

### హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్‌కు సూచన




**న్యూఢిల్లీ,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం పక్రియలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వేలం పక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏదైనా అభ్యంతరం ఉంటే హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ మోహన్ ఉన్నారు. దీంతో రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం కొనసాగించేందుకు టీజీఐఐసీకి న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్టయ్యాయి. రాయదుర్గం పాన్‌మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూముల విక్రయానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో ఎకరాకు రూ.175 కోట్లను కనీస ధరగా నిర్ణయించింది. ఈ వేలాన్ని సవాలు చేస్తూ ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, రక్షించాల్సిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. అయితే పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. కంచ గచ్చిబౌలి భూములకు, ప్రస్తుతం వేలం వేయనున్న భూములకు ఎలాంటి సంబంధం లేదని, అవి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. టీజీఐఐసీ నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. అంతే కాదు తదుపరి పిటీషన్‌పై విచారణకు నిరాకరించింది.

# గురువులంటే గౌరవం లేకుండా పోతోంది!

### విద్యార్థులను మందలించే పరిస్థితి లేదు -ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చేందుకు భయపడుతున్నాం

### రూపారెడ్డి హత్యను నిరసిస్తూ సత్తుపల్లిలో టీచర్ల మౌన ప్రదర్శన







**సత్తుపల్లి/ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
విద్యార్థులను సన్మార్గంలో నడిపించే ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం, భద్రత కరువవుతోందని పలువురు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యను నిరసిస్తూ శుక్రవారం సత్తుపల్లిలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు మౌన ప్రదర్శన నిర్వహించారు.
ముందుగా సంతాప సభ నిర్వహించి రూపారెడ్డి మృతికి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మౌనంగా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రేహానా కమల్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పిల్లల ప్రవర్తన, అలవాట్లను తల్లిదండ్రులు నిశితంగా గమనిస్తూ నైతిక, మానవీయ విలువలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు.

**పెన్ను, పుస్తకం పట్టాల్సిన చేతుల్లో కత్తులెందుకు?**

సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు పసుపులేటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుడిని హత్య చేయాలనే ఆలోచన రావడం సమాజానికి తీవ్ర హెచ్చరిక అన్నారు. "పెన్ను, పుస్తకం పట్టాల్సిన చేతుల్లోకి కత్తులు ఎందుకు వస్తున్నాయి?" అని ప్రశ్నించారు.
పదో తరగతి విద్యార్థుల జీవితంలో కీలకమైన దశ అని, ఈ వయసులో భవిష్యత్తు, చదువు, ఉద్యోగాలపై దృష్టి పెట్టాల్సిన విద్యార్థులు హింసాత్మక ఆలోచనలకు లోనుకావడం బాధాకరమన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, బాధ్యత, గురువుల పట్ల గౌరవం నేర్పించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**మందలించాలన్నా భయమే!**

విద్యార్థుల తప్పులను సరిదిద్ది క్రమశిక్షణలో పెట్టాల్సిన ఉపాధ్యాయులు వారిని మందలించాలన్నా భయపడే పరిస్థితులు నెలకొన్నాయని పలువురు టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడికి విద్యార్థిని సరిదిద్దే హక్కు లేకుండా పోతే రేపటి సమాజ భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు రక్షణ, గౌరవం కల్పించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేపీఆర్ స్కూల్ ప్రభాకర్‌రెడ్డి, కిరణ్, చైతన్య స్కూల్ మురళి, టాలెంట్ స్కూల్ శ్రీనివాసరావు, వాణి విద్యాలయం వంశీ, శాంతినికేతన్ అనిల్, త్రివేణి స్కూల్ వంశీ, గీతాంజలి శ్రీనివాసరావు, నారాయణ, రామమూర్తి, శంకర్, మారేష్, జ్యోతి నిలయం, కల్లూరు లిటిల్ ఫ్లవర్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కక్షతో పథకం.. గొంతుకోసి హత్య

**రాంపూర్ శివారులో వెంకటేశ్వర్లు దారుణ హత్య**

**కుమార్తె ప్రేమ వివాహం వ్యవహారంలో కక్ష..**
**ముగ్గురు నిందితుల అరెస్ట్**

**కత్తి, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం**



**హనుమకొండ ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామ శివారులో జరిగిన పోలు వెంకటేశ్వర్లు అలియాస్ వెంకన్న దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పథకం ప్రకారం మద్యం తాగించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు వెంకటేశ్వర్లు కుమార్తె రమ్యను చిల్పూర్‌కు చెందిన అంబటి పరమేష్ కుమారుడు వినయ్ 2022లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో ఇద్దరూ విడిపోయారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య పలుమార్లు పంచాయితీలు జరిగాయి. 2023లో జరిగిన ఓ పంచాయితీలో వెంకటేశ్వర్లు తనను దూషించాడనే కారణంతో పరమేష్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లును హత్య చేయాలని పథకం వేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**మద్యం తాగిస్తామంటూ..**

ఈ నెల 17న పరమేష్ తనకు పరిచయమైన దామెర సంపత్‌ను ఇంటికి పిలిపించి వెంకటేశ్వర్లును బయటకు తీసుకువచ్చి మద్యం తాగించాలని, అనంతరం హత్య చేసేందుకు సహకరించాలని కోరాడు. అదే రోజు చిలుముల వెంకటస్వామితో ఫోన్‌లో మాట్లాడి హత్యకు సహకరించాలని కోరినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం న్యాయపరమైన వ్యవహారాలు తాను చూసుకుంటానని వెంకటస్వామి హామీ ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. పరమేష్ సూచన మేరకు సంపత్ వెంకటేశ్వర్లును బయటకు తీసుకువచ్చి మద్యం తాగించాడు. అనంతరం పరమేష్ కూడా వారితో కలిసి మద్యం సేవించాడు. ఆ తర్వాత వెంకటేశ్వర్లును తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని రాంపూర్ గ్రామ శివారులోని మాడెలయ గుడి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు.

**కారం చల్లి.. గొంతుకోసి..**

మద్యం మత్తులో ఉన్న వెంకటేశ్వర్లుపై పరమేష్ కారం పొడి చల్లి, కత్తితో గొంతు కోసి హత్య చేసినట్లు నిందితుడి ఒప్పుకోలు, దర్యాప్తులో లభించిన ఆధారాల ద్వారా పోలీసులు గుర్తించారు. హత్య అనంతరం పరమేష్ వెంకటస్వామికి ఫోన్ చేసి విషయం చెప్పగా, అతడు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని చూసినట్లు పోలీసులు తెలిపారు.
అనంతరం హత్యకు ఉపయోగించిన కత్తిని మాడెలయ గుడి సమీపంలోని సిమెంట్ పైపుల్లో పరమేష్ దాచిపెట్టాడు. దర్యాప్తులో పోలీసులు ఆ కత్తిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**ముగ్గురు అరెస్ట్**

ఈ కేసులో చిల్పూర్ మండలం, జనగామ జిల్లాకు చెందిన అంబటి పరమేష్ (56), దామెర సంపత్ (41), కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన చిలుముల వెంకటస్వామి (53)లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఆయుధం, మొబైల్‌ఫోన్, ద్విచక్రవాహనం తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల నుంచి మరిన్ని ఆధారాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై గతంలో నమోదైన కేసులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆ1 పరమేష్‌పై జనగామ, కొత్తపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, ముల్కనూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసులు ఉండగా.ఆ2 సంపత్‌పై స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో, ఆ3 వెంకటస్వామిపై ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.
కాజీపేట ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసును ఛేదించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు తక్కువ వ్యవధిలోనే నిందితులను పట్టుకోవడంతో స్థానికంగా పోలీసుల దర్యాప్తుపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. కేసులో మరిన్ని ఆధారాలను సేకరించి చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**సవాళ్లను అవకాశంగా మార్చుకోవాలి**

**అక్టోబర్, నవంబర్ నెలలు అత్యంత కీలకం..**

**పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా చూడాలి**

**భూగర్భ జలాలను అంచనా వేసి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలి**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల కష్టాలను తీర్చాలి**

**వర్క్‌షాపులో పలువురు మంత్రుల సూచన**



**హైదరాబాద్‌ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు. ల్గ÷తులను ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా రైతుకు నష్టం రాకుండా చూడాలన్నారు.

# అన్నవరం బస్టాండ్‌లో మంత్రి మండిపల్లి ఆకస్మిక తనిఖీ



**కాకినాడ,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):** అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలుపై మహిళా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతోందని మహిళలు ప్రశంసలు కురిపించారు. అన్నవరం బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాలపైనా మంత్రి ఆరా తీశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం అన్నవరం ఆర్టీసీ క్యాంటీన్‌ను సందర్శించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో కలిసి అల్పాహారం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు

## గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతుంది: అచ్చన్న

**అమరావతి,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**ంబేద్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవు నుంచి 'ముత్యాలమ్మ' బోటులో ఆగస్టు 3న చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన సంగతి తెలిసిందే. ఒడిశాలోని పారాదీప్ తీరం వద్ద ఒక పసుపు రంగు బోటును అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై తాజాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చే వరకు అన్ని మార్గాల్లోనూ సెర్చ్ ఆపరేషన్ ఆపే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ గాలింపు చర్యల కోసం ఏకంగా 5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, ఒక ప్రత్యేక హెలికాప్టర్‌ను రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గల్లంతైన బోటు వివరాలను మయన్మార్, పోర్ట్÷-లబెయిర్, బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా పంపించామని, సరిహద్దు తీరప్రాంతాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కేంద్ర కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులతో ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ నెల 24 తర్వాత కొత్త అధికారి బాధ్యతలు చేపట్టినప్పటికీ గాలింపు చర్యలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం వారి రక్షణకు అన్ని విధాలుగా కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు.

----

# తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు

## సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ



**హైదరాబాద్‌ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు నడుస్తోంది అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఇటీవల కాలంగా తెలంగాణ కాంగ్రెస్ నేతల అంతర్గత కలహాల వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుం దన్నారు. రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ఏ తప్పూ చేయకుండా ఉంటేనే మంత్రులు, కిందిస్థాయి అధికారుల్లో భయం ఉంటుంది. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టిపెట్టాలని పరోక్షంగా సూచించారు. 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదు, ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని పేర్కొన్నారు. తమ సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తిపెరుగుతుందన్నారు.

# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

## జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# ప్రియాంక బెటర్ ఛాయిస్



**ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**
పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తీరును గమనిస్తే..ప్రతిపక్షాలు సభను స్తంభించడం మినహా చేసిందేమీ లేదు. లోపలా, బయటా ప్రియాంక తీరు ఆశాజనకంగా ఉంది. ఆమె సపందర్భోచితంగా మాట్లాడుతున్నారు.

రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ గలుగు తున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగలరని భావించవచ్చు. పార్మలెంటులో సమస్యలపై ఆమె అవగాహనతో మాట్లాడుతున్నారు. ఎందుకంటే రాహుల్ కేవలం మోడీ లక్ష్యంగా చేస్తున్న విమర్శలు పెద్దగా ఆకట్టుకోలేక పోతున్నాయి. మోడీని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. లోక్‌సభలో అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. గత సమావేశాల్లో వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించడ లేదు. డీ లిమిటేషన్‌పై మళ్లీ పార్లమెంట్ పెడితే ప్రియాంకను ముందు పటెట్టం మంచిది. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం చేయగలదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధం ఆకట్టుకుంది. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరగాలి. సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది విపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఆమెను ముందు నిలబెడితే మంచిది.

# వరలక్ష్మీదేవిగా అభయమిచ్చిన కనకదుర్గమ్మ

## ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

## పలు ఆలయాల్లో శ్రావణ సందడి



**విజయవాడ,ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వెలసిన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వరలక్ష్మి దేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారికి దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు. జై దుర్గా జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా దుర్గమ్మ ఆలయంతోపాటు
రాష్ట్రంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే కొన్ని ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. శాకంబరీ దేవి అలంకరణలో కుంకుళ్లమ్మ అమ్మవారు.. భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించారు. భక్తులు.. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. భీమవరం మావుళ్లమ్మకు నాలుగు లక్షల గాజులతో అలంకరించారు.శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఇందుకోసం భక్తులు నాలుగు లక్షల గాజులను సమర్పించారు. నెల్లూరు జిల్లాలో శ్రావణ శుక్రవార పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేషార్చనలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని గాజులు, వజ్రకిరీటంతో ప్రత్యేకంగా అలంకరించారు. అటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విశాఖపట్నం: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపారు. శ్రీకనకమహాలక్ష్మి, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# కాకరేపుతున్న సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యలు

## కొండా సురేఖపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత -సీఎం సహా నేతలంతా చర్యలకు పట్టు



**హైదరాబాద్‌ఆగస్ట్ 21,(ప్రజావినికిడి):**మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె సుస్మిత చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులి వ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు సురేఖ పార్టీ నుంచి వెళ్లిపోవడం మంచిదని పలువురు ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోక ముందే తప్పుకోవాలన్నారు, ముఖ్యమంత్రిపై తీవ్ర స్థాయిలో చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలో ఉన్నప్పుడే కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరికొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ బుధవారం మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలినని గురువారం సమాచారం ఇచ్చారు.మూాడ్రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకోవడంతో పాటు ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. ఇదే సమయంలో మంత్రి మాజీ ఓఎస్‌డీ సుమంత్‌పై గురువారం కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో ఈ కేసును పోలీసులు నమోదు చేశారు. గతంలో ఓ వివాదంలో ఇతనిని అరెస్టు చేయడానికి ప్రయత్నించినపుడు కూడా కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ సమయంలో పార్టీలోని కొందరి జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినా, తాజా పరిణామాల్లో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఇలాంటి వ్యవహారాల్లో ఆచితూచి అడుగేయాలనే అభిప్రాయం కూడా పార్టీలో కొందరు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తమ్మీద ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయం అని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆమె మాటలపై వివరణ ఇవ్వాలని మంత్రి కొండా
సురేఖకు ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. మంత్రి వివరణను పరిశీలించాక ఏం చేయాలో ఆలోచిస్తాం' అని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీకి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎవరికి వారు పలానా స్థానం నుంచి పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. టికెట్లు ఇవ్వడంలో సీడబ్ల్యూసీ, అధిష్ఠానానిదే తుది నిర్ణయం. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వంపై ఎందుకు వ్యాఖ్యలు చేశారు? ఆయన ఆవేదన ఏమిటి? అనేది అర్థం చేసుకున్నాం. ఆ నియోజకవర్గంలోని కొత్త, పాత నేతలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. నిషేధిత భూములకు సంబంధించిన 22ఏ పై భారాస అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పులను సరిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని వివరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# తొలి టెస్ట్‌లో ఘోర పరాజయం దిశగా పాకిస్థాన్





## నిప్పులు చెరిగిన ఇంగ్లండ్ జట్టు బౌలర్లు

## పెవిలియన్‌కు క్యూ కట్టిన పాక్ బ్యాటర్లు

ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ ఘోర పరాజయం దిశగా సాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో 238 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్.. 76 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ జట్టు ఇంకా 160 ప్లస్ రన్స్ వెనుకంజలో ఉంది. ఇంగ్లండ్ బౌలర్లు జోష్ టంగ్, జోఫ్రా ఆర్చర్, ఓలీ రాబిన్సన్ నిప్పులు చెరగడంతో పాక్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్లు అజాన్ అవైస్(9), ఇమామ్ ఉల్ హక్(0) తీవ్రంగా నిరాశపర్చగా.. షాన్ మసూద్(29) క్రీజులో నిలబడే ప్రయత్నం చేశాడు. కానీ అతన్ని జోష్ టంచ్ పెవిలియన్ చేర్చాడు. అబ్దుల్లా షఫీక్(15), సౌద్ షకీల్(14), కెప్టెన్ సల్మాన్ అఘా(4) కూడా వెనుదిరగడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో మహమ్మద్ రిజ్వాన్(8 బ్యాటింగ్)తో పాటు అలి ఉస్మాన్(2 బ్యాటింగ్) ఉన్నాడు. మరో సెషన్నర ఆట మిగిలి ఉండగా.. మూడో రోజు ఆటలోనే ఈ మ్యాచ్ ఫలితం తేలనుంది. అదే జరిగితే.. పాకిస్థాన్ ఇన్నింగ్స్ తేడాతో ఓటమి పాలవ్వనుంది. అంతకుముందు 366/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 409 పరుగుల భారీ స్కోర్ చేసింది. జోర్డాన్ కాక్స్(73), కెప్టెన్ జోరూట్(66), హ్యారీ బ్రూక్(91), డాన్ లారెన్స్ సత్తా చాటారు. పాక్ బౌలర్లలో అలి ఉస్మాన్(5/95) ఐదు వికెట్లు తీయగా.. ఖుర్రమ్ షెహ్‌జాద్(3/133) మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే కుప్పకూలింది. అబ్దుల్లా షఫీక్(61) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఇమామ్ ఉల్ హక్(42) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్(5/51), జోష్ టంగ్(5/46) ఐదేసి వికెట్లతో పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. గాయంతో బాబర్ ఆజామ్ ఈ మ్యాచ్‌కు దూరమవ్వడంతో పాక్ బ్యాటింగ్ లైనప్ బలహీనంగా మారింది. ఒక్క బ్యాటర్ కూడా క్రీజులో నిలబడలేకపోయాడు. మరోవైపు జో రూట్ అరుదైన ఘనత నమోదు చేశాడు. క్రీజులో పాతుకుపోయి ఆడిన రూట్ 112 బంతుల్లో 10 ఫోర్ల సాయంతో 66 రన్స్ చేసి పెవిలియన్ కు చేరాడు.

ఈ ఇన్నింగ్స్‌తో టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన ఇండియన్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ 68 ఫిఫ్టీల రికార్డును రూట్ సమంగా చేసి, చరిత్రకెక్కాడు. వెస్టిండీస్ గ్రేట్ శివనారాయణ్ చంద్రపాల్ 66 ఫిఫ్టీలతో రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలెన్ బోర్డర్, ఇండియా దిగ్గజం రాహుల్ ద్రవిడ్ 63 ఫిఫ్టీలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. కెప్టెన్‌గా 42వ సారి యాభై ప్లస్ స్కోరు సాధించిన రూట్ ఈ జాబితాలో ఐదో స్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్ 61 స్కోర్లతో టాప్ స్థానం దక్కించుకున్నాడు.

# జహీర్ ఖాన్ సలహాతోనే నేను ఓపెనర్‌గా..



టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ విధ్వంసం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రెడ్ బాల్ క్రికెట్‌లో దూకుడుగా ఆడిన తొలి బ్యాటర్ సెహ్వాగ్ అనడంలో కూడా ఎలాంటి అతిశయోక్తి లేదు. 99, 199, 299 పరుగుల వద్ద కూడా సిక్సర్ బాదిన ఏకైక డాషింగ్ బ్యాటర్ సెహ్వాగ్. అయితే కెరీర్ ఆరంభంలో సెహ్వాగ్ లోయర్ మిడిలార్డర్‌లో ఆడేవాడు. ఆ తర్వాత ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అప్పటి కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. సెహ్వాగ్ కోసం తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేశాడని అంతా అనుకుంటారు. కానీ తనను ఓపెనర్‌గా ప్రమోట్ చేసింది గంగూలీ కాదని తాజాగా సెహ్వాగ్ వెల్లడించాడు. పాకిస్థాన్ మాజీ ప్లేయర్ షోయబ్ అక్తర్‌తో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ వీరేంద్ర సెహ్వాగ్ ఈ విషయాన్ని పంచుకున్నాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసే తనను ఓపెనర్‌గా ఆడించాలని గంగూలీకి జహీర్ ఖాన్ చెప్పాడని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. ఓపెనర్‌గా తాను విఫలమైతే జట్టు నుంచి తొలగించవద్దని గంగూలీని తాను వేడుకున్నానని, దానికి అతను హామీ ఇచ్చాడని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. సచిన్ గాయంతో జట్టుకు దూరమవడంతో 2002లో ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్‌లో సెహ్వాగ్ ఓపెనర్‌గా అరంగేట్రం చేశాడు. తొలి బంతి నుంచే బౌండరీలు బాది టెస్ట్ క్రికెట్‌కు దూకుడు పరిచయం చేసిన సెహ్వాగ్.. 104 టెస్ట్‌ల్లో 23 సెంచరీలు, 32 హాఫ్ సెంచరీలతో 8586 పరుగులు చేశాడు. ఇందులో రెండు ట్రిపుల్ సెంచరీలు ఉన్నాయి. 251 వన్డేలు ఆడిన సెహ్వాగ్ 15 సెంచరీలతో 8273 పరుగులు సాధించాడు. ఇండోర్‌లో జరిగిన మ్యాచ్‌లో అతను 219 పరుగులతో డబుల్ సెంచరీ కూడా సాధించాడు. 2007 టీ20 ప్రపంచకప్ , 2011 వన్డే ప్రపంచ కప్‌లను భారత్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. సెహ్వాగ్‌ను ఓపెనర్‌గా ఆడించా లని జహీర్ ఖాన్ ఇచ్చిన సలహా.. భారత జట్టు రాతనే మార్చేసింది.




# సాత్విక్ చిరాగ్ శెట్టి జోడీ ఓటమి

బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి - చిరాగ్ శెట్టి ద్వయం పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో సాత్విక్- చిరాగ్ శెట్టి జోడీ ఓడిపోయింది. ఈ ద్వయం వరల్డ్ నెం 3 జోడీ లియాంగ్ వి కెన్- వాంగ్ చంగ్ (చైనా)ను క్వార్టర్స్‌లో ఢీ కొట్టింది. వరుస సెట్లలో 18-21 9-21 తేడాతో భారత ద్వయం ఓడిపోయింది. దీంతో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో మూడో పతకం నెగ్గాలన్న సాత్విక్- చిరాగ్ ఆశలు ఆవిరయ్యాయి. సొంత అభిమానుల మధ్య భారీ అంచనాలతో దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో, భారత జోడీ సాత్విక్ - చిరాగ్, చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ చాంగ్‌తో తలపడ్డారు. మ్యాచ్ తొలి సెట్ హోరాహోరీగా సాగింది. తొలి నుంచే ఇరు జట్ల ఆటగాళ్లు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీపడి పాయింట్లు సాధించడంతో ఆట ఉత్కంఠభరితంగా సాగింది. అయితే భారత జోడీ గట్టిగా పోరాడినప్పటికీ, మొదటి సెట్‌ను చైనా ద్వయం 21- 18తో కైవసం చేసుకుంది. దీంతో రెండో సెట్‌లో సాత్విక్ - చిరాగ్ కమ్‌బ్యాక్ ఇస్తారని అభిమానులు ఆశించారు. కానీ, మొదటి సెట్ విజయం ఇచ్చిన ఉత్సాహంతో చైనా జోడీ రెండో సెట్ ఆరంభం నుంచే తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. మరింత దూకుడు పెంచి ధనాధన్ షాట్లతో పాయింట్లు సాధించింది. దీంతో చైనా జోడీ వరుసగా రెండో సెట్‌ను కూడా సొంతం చేసుకుంది. ఫలితంగా లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ చాంగ్ ద్వయం సెమీఫైనల్‌కు అర్హత సాధించడమే కాకుండా, పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ పతకం తీసుకొస్తుందని అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇలా క్వార్టర్స్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించడంతో అభిమానులు నిరాశకు లోనయ్యారు. ఇటీవల సింగపూర్ ఓపెన్ వంటి అంతర్జాతీయ టోర్నమెంట్లలో టైటిల్స్ గెలిచి అద్భుతమైన ప్రదర్శన చేసిన ఈ జోడీ, సొంత గడ్డపై ఓడిపోవడం భారత అభిమానులను నిరుత్సాహానికి గురిచేస్తుంది. కాగా, గురువారం మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు కూడా ప్రీ క్వార్టర్స్‌లో ఓడిపోయింది.

# క్వార్టర్ ఫైనల్స్‌లో ట్రీసా జాలీ




భారత్‌కు తొలి పతకం ఖాయమైంది. భారత స్టార్ ద్వయం ట్రీసా జాలీ- గాయత్రి గోపిచంద్ క్వార్టర్ ఫైనల్‌లో విజయం సాధించింది. ఈ జోడి శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌లో ఫైనల్‌లో చైనాకు చెందిన జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్‌పై 16-21, 21-15, 21-13 తేడాతో విజయం సాధించింది. దీంతో ట్రీసా- గాయత్రి జోడీకి పతకం (కనీసం కాంస్యం) ఖాయమైంది. ఈ మ్యాచ్ తొలిసెట్లో భారత ద్వయంపై చైనా జోడీ జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్‌దే ఆధిపత్యంగా సాగింది. ట్రీసా- గాయత్రి పోరాడినప్పటికీ ప్రత్యర్థి జోడీ దూకుడుగా ఆడి తొలి సెట్‌ను 21-16తో సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో భారత జోడీ సూపర్ కమ్‌బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ధనాధన్ షాట్లతో ఎటాక్‌కు దిగింది. మ్యాచ్‌లో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన సెట్‌ను ట్రీసా- గాయత్రి ద్వయం 21-15తో సొంతం చేసుకుంది. దీంతో మ్యాచ్ ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. అయితే ఇండియన్ షట్లర్లు అదే జోరును ప్రదర్శించారు. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి మూడ సెట్‌ను 21-13 భారీ తేడాతో గెలుచుకున్నారు. మొత్తం గంటా తొమ్మిది నిమిషాల పాటు సాగిన ఆటలో 16-21, 21-15, 21-13 తేడాతో విజయం సాధించిన ట్రీసా- గాయత్రి సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో మన షట్లర్లకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. కాగా, బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో భారత్ చివరిసారిగా 2011లో పతకం సాధించింది. లండన్ వేదికగా జరిగిన ఆ పోటీలో భారత షట్లర్ జోడీ జ్వాలా గుత్తా - అశ్విని పొన్నప్ప కాంస్య పతకం గెలుచుకుంది. మళ్లీ 15ఏళ్లకు ఈ విభాగంలో భారత్ పతకం అందుకోనుంది. 2022, 2023 సంవత్సరాలలో ట్రీసా - గాయత్రి జోడీ వరుసగా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2022లో కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని కూడా గెలుచుకుంది. గతేడాది ప్రారంభంలో టాప్ 10లోకి ప్రవేశించింది. అయితే, ఈ సంవత్సరం ప్రారంభంలో ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్, ఉబెర్ కప్‌కు ముందు శిక్షణ తీసుకుంటుండగా ట్రీసా చీలమండకు గాయమైంది. ప్రాక్టీస్ చేస్తుండగా ఆమె అనుకోకుండా ఆమె చీలమండ బెణికింది. దీంతో ట్రీసా రిహబిలిటేషన్‌కు వెళ్లింది. గాయం నుంచి పూర్తిగా కోలుకొని ఇటీవల ఇండోనేసియా ఓపెన్‌లో ఈ ద్వయం మళ్లీ బరిలోకి దిగింది. ఆపై యూఎస్ ఓపెన్, ఈ నెల ప్రారంభంలో ఫిలిప్పైన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో విజేతగా నిలిచింది. ఇప్పుడు వరల్డ్ ఛాంపియన్స్‌షిప్స్‌లోనూ పతకం ఖాయం చేసుకుంది.

# సచిన్ రికార్డును సమం చేసిన రూట్

హైదరాబాద్ : పాకిస్తాన్, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో జో రూట్ అరుదైన ఘనత సాధించాడు. పాక్ తో జరుగుతున్న తొలి టెస్ట్ సందర్భంగా 68వ అర్థ సెంచరీ పూర్తి చేసుకున్న ఇంగ్లాండు టెస్ట్ కెప్టెన్ రూట్... సచిన్ టెండూల్కర్ రికార్డ్ ను సమం చేశాడు. సచిన్ టెండూల్కర్ ఇప్పటి వరకు 68 అర్థ సెంచరీలు టెస్టులలో సాధించారు.ఆ తర్వాత చందర్ పాల్ 66, బోర్డర్ 63, రాహుల్ ద్రావిడ్ 63 అర్ద సెంచరీలు నమోదు చేశారు.



# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ




టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు.

శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

# నటి షావుకారు జానకి మృతి

## వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత షావుకారు సినిమాతో పేరు స్థిరం

తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి


'Sowcar' Janaki
(1931 - 2026)

సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు.

భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# ఇరుముడి ఎమోషనల్ డ్రామా


రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని

అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి




చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల



లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విఘ్న ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.



# 'స్పిరిట్'లో ప్రకాశ్ రాజ్ లేరు.. క్లారిటీ ఇచ్చిన నిర్మాత

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం నుంచి ఒక కీలక అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ నటించడం లేదని అధికారికంగా స్పష్టత వచ్చింది. చిత్ర నిర్మాత ప్రణయ్ వంగా స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ చిత్రంలోని జైలర్ పాత్ర కోసం తొలుత ప్రకాశ్ రాజ్‌ను సంప్రదించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది సాధ్యపడలేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది విడుదలైన టీజర్‌లో ప్రకాశ్ రాజ్ వాయిస్ ఓవర్ వినిపించడంతో ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అందరూ భావించారు. అయితే, ఆ తర్వాత ఆయన ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా నిర్మాత చేసిన ప్రకటనతో ఆ వార్తలకు బలం చేకూరినట్లయింది.

మరోవైపు 'స్పిరిట్' చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి అతిథి పాత్రలో కనిపించనున్నారంటూ వస్తున్న ఊహాగానాలకు కూడా ప్రణయ్ వంగా తెరదించారు. ఈ సినిమాలో చిరంజీవి ఎలాంటి క్యామియో చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీ భోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613